# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 130 23-5-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## లోక్ సభ సీట్లపై నారా లోకేష్ వర్సెస్ షర్మిల

- నియోజకవర్గాల పునర్విభజనపై లోకేష్ గందరగోళం సృష్టిస్తున్నారని షర్మిల విమర్శ
- జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించవద్దని కాంగ్రెస్ వాదన
- సీట్లు పెంచడం కాదు, పార్లమెంటులో సాపేక్ష ప్రాతినిధ్యమే కీలకమని స్పష్టీకరణ
- దక్షిణాది ప్రయోజనాలపై బీజేపీ స్పష్టమైన రాజ్యాంగ హామీ ఇవ్వలేదని ఆరోపణ
- సమాఖ్య స్ఫూర్తిని వదిలి టీడీపీ ఇప్పుడు బీజేపీని సమర్థిస్తోందని విమర్శ



2లో



## చొరబాట్లపై ఉక్కుపాదం: అమిత్ షా

సరిహద్దుల్లో 'స్మార్ట్ బోర్డర్'ప్రాజెక్టు

6 వేల కిలోమీటర్ల భద్రతా గ్రిడ్

2లో

## మా నాన్న ఉత్తరం రాశారు, మా తాత కల కన్నారు అంటే నమ్మేవాళ్ళు ఎవరూ లేరు బ్రదర్

- జమ్మలమడుగులో రూ.3 వేల కోట్ల ఎస్ఏఈఎల్ సోలార్ ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి లోకేష్
- ఇది దార్శనికత, నమ్మకం, వేగానికి ప్రతిరూపమని వ్యాఖ్య
- మా బ్రాండ్ ఉద్యోగాల కల్పన అయితే, మీ బ్రాండ్ గొడ్డలి అంటూ పరోక్ష విమర్శలు
- రికార్డు స్థాయిలో కేవలం 11 నెలల్లోనే 600 మెగావాట్ల ప్రాజెక్టు పూర్తి
- బ్రాండ్ చంద్రబాబు, డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే అభివృద్ధి పరుగులు పెడుతోందని వెల్లడి



2లో

# సైప్రస్‌తో సుదృఢ బంధం

- భారత్, సైప్రస్ మధ్య ఇక వ్యూహాత్మక భాగస్వామ్యం
- రక్షణ సహకారంలో ఐదేళ్ల రోడ్‌మ్యాప్ ఆవిష్కరణ
- ప్రధాని మోదీతో సైప్రస్ అధ్యక్షుడు నికోస్ భేటీ
- ఆరు ఒప్పందాలపై ఇరుదేశాల సంతకాలు



న్యూఢిల్లీ: భారత్, సైప్రస్ దేశాల మధ్య బంధం మరింత బలోపేతం కానుంది. ఇరుదేశాలు తమ సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లాయి, వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకున్నాయి. రక్షణ సహకారం విషయంలో ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించాయి. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలైడ్స్ శుక్రవారం ఢిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, పరస్పర సహకారంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నూతన ఆవిష్కరణలు, టెక్నాలజీ, విద్య, సంస్కృతి తదితర రంగాల్లో సహకారం కోసం ఇరుదేశాలు ఆరు ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఉగ్రవాదాన్ని అరికట్టడానికి ఒక సంయుక్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసే ఒప్పందం కూడా ఇందులో ఉంది. వలసలపై ఒక సమగ్ర భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని భారత్, సైప్రస్ నిర్ణయించుకున్నాయి. వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, నూతన సాంకేతికతలు, విద్య వంటి రంగాల్లో సంబంధాలతోపాటు ఇండియామిడిల్ ఈస్ట్‌యూరప్ ఎకనామిక్ కారిడార్ అమలుపై నరేంద్ర మోదీ, నికోస్ క్రిస్టోడౌలైడ్స్ చర్చించుకున్నారు. ఈ భేటీ అనంతరం మోదీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం సైప్రస్‌లోని మౌలిక సదుపాయాలు, ఇంధనం,

- మిగతా 2వ పేజీలో




## 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

- రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న భట్టి, తుమ్మల
- తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతం... దేశ సగటు కంటే వేగంగా వృద్ధి రేటు
- పట్టణీకరణతో సేవల రంగానికి భారీ అవకాశాలు...విద్యార్థుల రుణాలు భవిష్యత్ పెట్టుబడులు
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ : 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇది పెద్ద కల అని, రాష్ట్ర ప్రస్తుత వృద్ధి రేటు చూస్తుంటే ఇది కచ్చితంగా సాధ్యమేనని స్పష్టమౌతోందన్నారు. ప్రస్తుతం దేశ సగటు ఊవృద్ధి రేటు 8.2% గా ఉంటే, తెలంగాణ వృద్ధి రేటు

- మిగతా 2వ పేజీలో



## పెద్దపులి దాడి.. నలుగురు మృతి

- గుంజవాహి అటవీప్రాంతంలో మహిళలపై పులి దాడి
- తునికాకు సేకరించేందుకు వెళ్లిన మహిళలపై దాడి చేసిన పెద్దపులి
- నలుగురు మహిళలు మృతి

### రోడ్డుపై ధాన్యం పోసి నిరసన..

## కవిత అరెస్



- సచివాలయం వద్ద కవిత భారీ ఆందోళన
- రోడ్డుపై ధాన్యం పోసి వినూత్న నిరసన
- రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలన్న డిమాండ్
- ఉద్రిక్తత మధ్య కవిత, కార్యకర్తల అరెస్ట్

## అసెంబ్లీ రద్దు చెయ్..

- ప్రజల తీర్పు ఏంటో చూద్దాం
- కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ఫైర్
- నెరవేరని హామీలపై తీవ్ర విమర్శలు
- రేవంత్‌కు ఓపెన్ ఛాలెంజ్.. అసెంబ్లీ రద్దు చేయాలన్న డిమాండ్
- 27 మంది ఎమ్మెల్యేలు రాజీనామాకు సిద్ధమన్న కేటీఆర్




2లో

# అగ్నిగుండంలా ఆంధ్రప్రదేశ్...

### లోకల్ సెలవులపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు.

- రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- చలివేంద్రాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశం
- తీవ్ర ఉష్ణోగ్రతలున్న ప్రాంతాల్లో స్థానికంగా సెలవులు ప్రకటించాలని సూచన
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని స్పష్టం
- ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం



ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు నిప్పుల కుంపటిలా మారాయి. రోజురోజుకూ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన వడగాడ్పుల (ఎమ్ఫ్ ఔుజవం) నేపథ్యంలో చంద్రబాబు గవర్నమెంట్ అలర్ట్ అయింది. ప్రజలను ఈ ప్రచండ భానుడి సెగల నుంచి కాపాడటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులతో ఒక హై-లెవెల్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న

- మిగతా 2వ పేజీలో

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

10.7% తో దూసుకుపోతోందన్నారు. దేశ సగటు తలసరి ఆదాయం రూ.2.1 లక్షలుగా ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.18 లక్షలతో దేశంలోనే అగ్రగామిగా ఉందని ప్రకటించారు. 202526 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్‌డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం గొప్పవిషయమన్నారు. వ్యవసాయ రుణాలకు సంబంధించి రూ.1,65,297 కోట్ల లక్ష్యానికిగాను రూ.1,68,401 కోట్లు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయమని చెప్పారు. శు క్రవారం ప్రజాభవన్‌లో 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని కోరారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో బ్యాంకులు మరింత సానుకూల దృక్పథంతో ముందుకు రావాలన్నారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానళ్ల ఏర్పాటు ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని సూచించారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో త్వరలోనే అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకువస్తున్నట్టు భట్టి వెల్లడించారు. ఇందులో భాగంగా ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ వంటి వివిధ రంగాలను డిజైన్ చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికీ వ్యవసాయ రుణాల్లోఅధిక భాగం స్వల్పకాలిక పంట రుణాలకే బ్యాంకులు పరిమితం కావడం ఆందోళన కలిగించే విషయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయం ఇప్పుడు ఉద్యానవనం, ఆయిల్ పామ్, సమగ్ర వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, రక్షిత సాగు, పాడి, మత్స్య, యాంత్రీకరణ వంటి రంగాల వైపు వేగంగా మారుతున్న నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థ కూడా ఇందుకు అనుగుణంగా స్పందించాలని కోరారు. గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, ప్యాక్ హౌస్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, డ్రిప్ ఇరిగేషన్, సోలార్ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ వంటి రంగాలకు దీర్ఘకాలిక పెట్టుబడి రుణాలు అందించాలని సూచించారు. 202526 లో పంట రుణాల పంపిణీ రూ.75,486 కోట్లకు చేరి, వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యంలో 84.34 శాతం సాధించిందన్నారు. మొత్తం వ్యవసాయ, అనుబంధ రంగాలు, మౌలిక వసతుల కింద రూ.1,68,401 కోట్ల రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం లక్ష్య సాధన నమోదు కావడం రాష్ట్ర బ్యాంకింగ్ వ్యవస్థ పురోగతిని సూచిస్తోందన్నారు. శుక్రవారం 49వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) త్రైమాసిక సమావేశంలో మంత్రి బ్యాంకింగ్ సంస్థల ప్రతినిధులు, నాబార్డ్ అధికారులు, సహకార బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు.

## అగ్నిగుండంలా ఆంధ్రప్రదేశ్...

(మొదటి పేజీ తరువాయి)

ఏరియాల్లో లోకల్ హాలిడేస్ (స్థానిక సెలవులు) ప్రకటించేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. గవర్నమెంట్ ఆఫీసులకు స్థానికంగా సెలవులు ఇవ్వాలా? లేక టైమింగ్స్ మార్చాలా? ఎన్ని రోజులు సెలవు ఇవ్వాలనే దానిపై త్వరలోనే పూర్తి క్లారిటీ వచ్చే ఛాన్స్ ఉంది. ఈ రివ్యూ మీటింగ్‌లో సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇచ్చారు. తీవ్రమైన హీట్ వేవ్ పరిస్థితులను తట్టుకునేలా ప్రతి ఊరిలో, పట్టణాల్లోని మెయిన్ సెంటర్లలో టెంట్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల కోసం చల్లని తాగునీరు, మజ్జిగ, అలాగే వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ (ా=ూ) ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా సమ్మర్ సీజన్‌లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా కూడా డ్రింకింగ్ వాటర్ ప్రాబ్లం రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలను ఆదేశించారు. ఎండల తీవ్రతపై ప్రజలు ఎలాంటి ప్రికాషన్స్ తీసుకోవాలో అవేర్‌నెస్ కల్పించడానికి జిల్లా కలెక్టర్లందరూ ప్రెస్ మీట్స్ నిర్వహించాలని సీఎం చంద్రబాబు డైరెక్ట్ చేశారు. వాతావరణ హెచ్చరికలను బట్టి ప్రజలను అలర్ట్ చేయాలని చెప్పారు. అమరావతిలో జరిగిన ఈ ఇంపార్టెంట్ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (జూ) సాయి ప్రసాద్‌తో పాటు విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల టాప్ అఫీషియల్స్ పాల్గొన్నారు. ప్రజలు కూడా మధ్యాహ్నం వేళల్లో అనవసరంగా బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

## సైప్రస్‌తో సుదృఢ బంధం

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ రంగాల్లో భారతీయ కంపెనీలకు వాణిజ్య మూలధనాన్ని అందుబాటులోకి తెచ్చి, కొత్త మార్గాలను తెరుస్తుందని పేర్కొన్నారు. అదే సమయంలో భారతదేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న షిప్పింగ్, సముద్ర పరిశ్రమల్లో పెట్టుబడులను పెంచుతుందని వెల్లడించారు. 'భారత్, సైప్రస్ స్నేహబంధం ఎన్నోసార్లు కాలపరీక్షలకు నిలిచిందని గుర్తుచేశారు. ఈ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచాలన్న నిర్ణయంతో ఇరుదేశాల బంధానికి కొత్త ఆశయాలను, కొత్త ఊపును ఇవ్వబోతున్నామని పేర్కొన్నారు. అలాగే సైబర్ సెక్యూరిటీ డైలాగ్‌ను ఏర్పాటు చేసుకోబోతున్నట్లు రెండు దేశాలు ప్రకటించాయి. భారత్‌యూరప్ సంబంధాలు మెరుగుపడటాన్ని మోదీ ప్రస్తావించారు. అవి ఒక కొత్త స్వర్ణయుగంలోకి ప్రవేశించాయని అన్నారు. మౌలిక సదుపాయాలు, నౌకా రవాణా వంటి కీలక రంగాల్లో సహకారం కోసం భారత్, సైప్రస్‌లు ఒక సంయుక్త టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాయని నికోస్ క్రిస్టోడౌలైడ్స్ తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళికంగా రాజకీయ అనిశ్చితి నెలకొన్న ఈ తరుణంలో యూరోపియన్ యూనియన్ (ఈయూ), భారత్ మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## మా నాన్న ఉత్తరం రాశారు, మా తాత కల కన్నారు అంటే నమ్మేవాళ్ళు ఎవరూ లేరు బ్రదర్

(మొదటి పేజీ తరువాయి)

ఒక ప్రాజెక్టు ప్రారంభమవ్వడమంటే కేవలం రిబ్బన్ కటింగ్ కాదని, అది దార్శనికత, నమ్మకం, వేగం, కార్యనిర్వహణల కలయిక అని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం జమ్మలమడుగు నియోజకవర్గం, కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3,000 కోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ (ాూజూ) వారి 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ, "మా నాన్న ఉత్తరం రాశారు, మా తాత కల కన్నారు, నేను ఆత్మలతో మాట్లాడాను అంటే ఇప్పుడు నమ్మేవాళ్ళు ఎవరూ లేరు బ్రదర్. మా బ్రాండ్ జాబ్ క్రియేషన్ అయితే... మీ బ్రాండ్ గొడ్డలి" అంటూ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. రికార్డు సమయంలో ఎస్ఏఈఎల్ ప్రాజెక్టు పూర్తి కావడం స్థానిక రైతుల, జమ్మలమడుగు యువత విజయమని లోకేష్ ప్రశంసించారు. "మీ సహకారం వల్లనే ఈ భారీ ప్రాజెక్టు కేవలం 11 నెలల్లో పూర్తయింది. ఈరోజు రాష్ట్రం మొత్తం జమ్మలమడుగు వైపు చూస్తోంది. ఇక్కడ మెగా సోలార్ పార్క్, అదానీ, చింతా గ్రీన్, జెన్‌కోఎన్టీపీసీ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులతో పాటు ఇప్పుడు ఎస్ఏఈఎల్ ను కూడా తీసుకువచ్చింది మనమే. కంపెనీలు తేవాలన్నా, ఉద్యోగాలు కల్పించాలన్నా అది బ్రాండ్ సీబీఎన్‌కే సాధ్యం" అని లోకేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పన విజయవంతం కావడానికి మూడు ముఖ్య కారణాలు ఉన్నాయని లోకేష్ వివరించారు. "మొదటిది బ్రాండ్ సీబీఎన్. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నాయకత్వం ఉండటంతో పెట్టుబడిదారులు ఏపీ వైపు చూస్తున్నారు. రెండవది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. వేగంగా నిర్ణయాలు తీసుకుని, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడం మా విధానం. ఈ ప్రాజెక్టే దానికి నిదర్శనం. మూడవది డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతోంది" అని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్, డ్రోన్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో 22 ప్రత్యేక గ్రోత్ క్లస్టర్లను నిర్మిస్తున్నామని లోకేష్ తెలిపారు. "ఆధునిక ఆర్థిక వ్యవస్థకు ఆవిష్కరణలే కీలకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి భవిష్యత్తు కోసం ప్రపంచంతో పోటీపడే ఎకోసిస్టమ్‌లను నిర్మిస్తున్నాయి" అని ఆయన వివరించారు. ఎస్ఏఈఎల్ సంస్థతో తన తొలి పరిచయాన్ని లోకేష్ గుర్తుచేసుకున్నారు. "ఢిల్లీలో ఒక టెలికాం ఆపరేటర్ల సమావేశంలో ఎస్ఏఈఎల్ నాయకత్వాన్ని కలిశాను. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై వారికున్న ఉత్సాహం, దీర్ఘకాలిక ప్రణాళిక నన్ను ఆకర్షించింది. వారి తపనను నేను వెంటనే గ్రహించగలిగాను" అని ఆయన నాటి సంఘటనను వివరించారు. పంజాబ్ కేంద్రంగా పనిచేసే ఒక కంపెనీ ఏపీలో విజయవంతం కాగలదా అనే సందేహం మొదట కలిగిందని, కానీ ఎస్ఏఈఎల్ బృందం క్షేత్రస్థాయిలో స్థానిక సమాజంతో మమేకమై పనిచేయడం చూశాక ఆ సందేహం తొలగిపోయిందని లోకేష్ అన్నారు. "వారు రైతులు, గ్రామస్థులు, అధికారులు, కార్మికులతో కలిసికట్టుగా పనిచేసి, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని ముందుకు సాగారు. ఆ స్ఫూర్తే ఈ ప్రాజెక్టు విజయానికి కారణం," అని ఆయన ప్రశంసించారు. ాూజూ సంస్థ రూ.3,000 కోట్ల పెట్టుబడితో, 2,400 ఎకరాల విస్తీర్ణంలో రెండు భారీ 300 మెగావాట్ల ప్రాజెక్టులను కేవలం 11 నెలల్లో పూర్తి చేసి రికార్డు సృష్టించిందని లోకేష్ తెలిపారు. పంజాబ్, రాజస్థాన్‌లోని ఎస్ఏఈఎల్ సొంత ప్లాంట్లలో తయారైన 12 లక్షలకు పైగా అత్యాధునిక సోలార్ మాడ్యూళ్లను ఈ ప్రాజెక్టులో వినియోగించారు. ఈ ఒక్క ప్రాజెక్టుతోనే ఏటా సుమారు 11 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను నివారించవచ్చని అంచనా. ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను 25 ఏళ్ల ఒప్పందం ప్రకారం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా

## పెద్దపులి దాడి.. నలుగురు మృతి

జీవనోపాధికోసం అడవికి వెళ్లిన మహిళలకు వారి జీవితాలు అక్కడే ముగిసిపోతాయని ఊహించలేదు. తునికాకు సేకరించేందుకు వెళ్లిన మహిళలపై పెద్దపులి దాడి చేసింది. ఈ ఘటనలో నలుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలోని సిందేవాహి తహసీల్‌లోని గుంజవాహి ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఈ దారుణ సంఘటన జరిగింది. అడవిలో మాటువేసి ఉన్న ఒక పులి, తునికాకులు ఏరుకోవడానికి వెళ్లిన నలుగురు మహిళలపై ఘోరంగా దాడి చేసి వారిని చంపేసింది. నివేదికల ప్రకారం, గుంజవాహి గ్రామానికి చెందిన ఈ మహిళలు, ఎప్పటిలాగే తునికి ఆకులను సేకరించడానికి ఈ ఉదయం గ్రామానికి సమీపంలోని దట్టమైన అడవికి వెళ్లారు. ఆ మహిళలు పనిలో నిమగ్నమై ఉండగా, పొదల్లో నక్కి ఉన్న పులి అకస్మాత్తుగా వారిపై దాడి చేసింది. ఆ పులి ఆ నలుగురు మహిళలను గాయపరిచి చంపేసింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందుకున్న వెంటనే, స్థానిక పోలీసు, అటవీ శాఖ ఉన్నతాధికారులు భారీ భద్రతా బలగాలతో సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను స్వాధీనం చేసుకుని, తదుపరి దర్యాప్తు ప్రారంభించారు. పులిదాడిలో ప్రాణాలు కోల్పోయిన మహిళల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## చొరబాట్లపై ఉక్కుపాదం: అమిత్ షా

న్యూఢిల్లీ: దేశ సరిహద్దుల గుండా జరిగే చొరబాట్లను ఏమాత్రం ఉపేక్షించబోమని హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. అక్రమ వలసదారులను గుర్తించి, వారిని దేశం నుంచి బహిష్కరించేందుకు, సరిహద్దులను పూర్తిగా మూసివేసేందుకు ఈ ఏడాది 'స్మార్ట్ బోర్డర్'ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. శుక్రవారం విజ్ఞాన్ భవన్‌లో జరిగిన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) సదస్సులో ఆయన ఈ విషయం వెల్లడించారు. దేశ అంతర్జాతీయ సరిహద్దుల్లో 6 వేల కిలోమీటర్ల మేర అభేద్యమైన భద్రతా గ్రిడ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అమిత్ షా వెల్లడించారు. స్మార్ట్ బోర్డర్ విధానంలో భాగంగా వచ్చే ఏడాదిలోగా బీఎస్ఎఫ్ బలగాలకు డ్రోన్ రాడార్లు, అత్యాధునిక కెమెరాలతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూరుస్తామన్నారు. అక్రమ వలసలు దేశ జనాభా స్వరూపాన్ని మార్చేందుకు పన్నుతున్న ఉద్దేశపూర్వక కుట్రగా ఆయన అభివర్ణించారు. దేశంలోని ప్రతి చొరబాటుదారుడిని గుర్తించి తిప్పి పంపుతామని ఆయన స్పష్టం చేశారు. అట్టడుగు స్థాయి నుంచి సమన్వయం: సరిహద్దుల్లో చొరబాట్లు, పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు బీఎస్ఎఫ్ అధికారులు రాష్ట్ర పోలీసులు, జిల్లా కలెక్టర్లు, గ్రామ పట్వారీలతో నేరుగా సమన్వయం చేసుకోవాలని అమిత్ షా సూచించారు. ఇందుకోసం నిఘా వ్యవస్థను మరింత విస్తరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వామపక్ష తీవ్రవాద నిర్మూలనను ఉదాహరణగా ప్రస్తావిస్తూ.. 'సమస్యను అదుపులో ఉంచడం భద్రత అనిపించుకోదు, దానిని మూలాల నుంచి నిర్మూలించడమే సరైన విధానం'అని వ్యాఖ్యానించారు. సరిహద్దు భద్రతా గ్రిడ్ కట్టుదిట్టమైన అమలుకు రాష్ట్ర ప్రభుత్వాల సహకారం కీలకమని షా పేర్కొన్నారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, అసోం, త్రిపుర రాష్ట్రాలతో విధానపరమైన సమన్వయం అవసరమని తెలిపారు. దీనిపై చర్చించేందుకు త్వరలోనే ఆ మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని వివరించారు.

## రోడ్డుపై ధాన్యం పోసి నిరసన.. కవిత అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం అవలంబిస్తున్న ఉదాసీన వైఖరిని నిరసిస్తూ హైదరాబాద్ సచివాలయం (సెక్రటేరియట్) ప్రధాన ద్వారం వద్ద తెలంగాణ రక్షణ సేన (ు=ూ) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భారీ ఆందోళన చేపట్టారు. పార్టీ నాయకులు, పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలతో కలిసి ఆమె సచివాలయాన్ని ముట్టడించారు. ఈ క్రమంలో సెక్రటేరియట్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో (ఐకేపీ సెంటర్లు) తీవ్ర జాప్యం జరుగుతోందని, రైతులు పండించిన పంటను తక్షణమే సేకరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కవిత మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం, తరుగు నెపంతో "కటింగ్స్" పేరుతో మిల్లర్లు, అధికారులు చేతులు కలిపి అన్నదాతలను నిలువునా ముంచుతున్నారని ఆమె ఆరోపించారు. రైతులకు మద్దతుగా నిలిచిన ఆమె.. తక్షణమే క్వింటాలు వరి ధాన్యానికి రూ. 500 చొప్పున బోనస్ చెల్లించాలని, ఎలాంటి నిబంధనలు లేకుండా వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వరితో పాటు జొన్నలు, పొద్దుతిరుగుడు వంటి ఇతర ప్రత్యామ్నాయ పంటలకు కూడా ప్రభుత్వం కనీస మద్దతు ధర (మీూ) కల్పించి ఆదుకోవాలని ఆమె గట్టిగా డిమాండ్ చేశారు. ఈ నిరసన సందర్భంగా కల్వకుంట్ల కవిత సచివాలయం మెయిన్ గేట్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై వరి ధాన్యాన్ని పోసి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. దీంతో సచివాలయం వైపు వచ్చే వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నిరసనకారులను అడ్డుకోవడానికి పోలీసులు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య నెట్టివేతలు, వాగ్వాదం జరిగి ఉద్రిక్తత మరింత పెరిగింది.

## అసెంబ్లీ రద్దు చెయ్.. ప్రజల తీర్పు ఏంటో చూద్దాం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం ముదిరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టార్గెట్‌గా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తూ ఒక హై-వోల్టేజ్ ఛాలెంజ్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలైనా ప్రజలకు ఇచ్చిన ప్రామిసెస్ ఏవీ నెరవేర్చలేదని, స్టేట్‌లో కంప్లీట్‌గా గవర్నెన్స్ ఫెయిల్ అయిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఎన్నో కీలకమైన వాగ్దానాలను అమలు చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యంగా కామన్ పీపుల్‌ని ఇబ్బంది పెడుతున్న పెట్రోల్, డీజిల్ ప్రైసెస్ విషయంలో కాంగ్రెస్ లీడర్స్ అప్పట్లో చేసిన స్టేట్‌మెంట్స్, ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. రేట్లు తగ్గించాల్సింది పోయి ప్రజలపై మరిన్ని భారాలు వేస్తున్నారని, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు బ్రతకలేని సిట్యుయేషన్ క్రియేట్ అయిందని విమర్శించారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఒక ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. "మీ కాంగ్రెస్ పరిపాలనపై, మీ డెవలప్‌మెంట్స్ పై మీకు అంత నమ్మకం ఉంటే.. దమ్ముంటే వెంటనే అసెంబ్లీని రద్దు చేసి ఫ్రెష్‌గా ఎలక్షన్స్‌కి వెళ్దాం" అంటూ సవాల్ చేశారు.

## లోక్ సభ సీట్లపై నారా లోకేష్ వర్సెస్ షర్మిల

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై టీడీపీ నేత నారా లోకేష్ లేనిపోని గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా విమర్శించారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసి, మెరుగైన మానవాభివృద్ధి సూచికలను సాధించిన దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించకూడదన్నదే తమ పార్టీ స్పష్టమైన వైఖరి అని ఆమె పునరుద్ఘాటించారు. కేవలం లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు రక్షణ లభించదని, పార్లమెంటులో వాటి సాపేక్ష ప్రాతినిధ్యం, రాజకీయ పలుకుబడి తగ్గకుండా చూడటమే అసలైన సవాల్ అని ఆమె అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత పి.చిదంబరం ట్వీట్ కు బదులిస్తూ నారా లోకేష్ చేసిన పోస్ట్ పై షర్మిల ఈ విధంగా స్పందించారు. ఈ అంశంపై శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. "దక్షిణాది రాష్ట్రాల గొంతుకను తగ్గించే ఎలాంటి పునర్విభజన ప్రక్రియనైనా కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ వ్యతిరేకిస్తోంది. దీనిపై తిరుగులేని రాజ్యాంగ హామీ ఉండాలని మేం డిమాండ్ చేశాం. ఆర్టికల్ 81 ప్రకారం చూస్తే, ఆంధ్రప్రదేశ్‌కు సంఖ్యాపరంగా సీట్లు పెరిగినా, అధిక జనాభా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య బలం, నిర్ణయాధికారం తగ్గిపోయే ప్రమాదం ఉంది," అని షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ సమస్యకు ప్రత్యామ్నాయాలను అన్వేషించడంలో విఫలమైందని ఆమె ఆరోపించారు. "రాజ్యాంగ నిపుణులు సూచించినట్లుగా స్థానిక సంస్థలను బలోపేతం చేయడం, రాష్ట్రాలకు, స్థానిక సంస్థలకు మరిన్ని ఆర్థిక, పరిపాలనా అధికారాలు ఇవ్వడం, వికేంద్రీకరణను ప్రోత్సహించడం వంటి మార్గాలను కేంద్రం ఏమాత్రం పట్టించుకోలేదు. కేవలం లోక్‌సభ సీట్లను పెంచడమే ఏకైక పరిష్కారంగా చూపింది," అని ఆమె పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో పార్లమెంటు సమావేశాల రోజుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, ఇప్పటికే జాతీయ చర్చల్లో దక్షిణాది రాష్ట్రాల వాణిని అణచివేస్తున్నారని షర్మిల విమర్శించారు. "సమాఖ్య సమతౌల్యాన్ని, పార్లమెంటరీ పనితీరును కాపాడకుండా సభను విస్తరిస్తే, వ్యక్తిగత ప్రాతినిధ్యం, అర్థవంతమైన చర్చ మరింత బలహీనపడతాయి. దక్షిణాది రాజకీయ ప్రాబల్యాన్ని శాశ్వతంగా కాపాడతామని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఎప్పుడూ స్పష్టమైన రాజ్యాంగ హామీ ఇవ్వలేదు. ఒకప్పుడు సమాఖ్య స్ఫూర్తి కోసం, దక్షిణాది ప్రయోజనాల కోసం పోరాడిన టీడీపీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు, దక్షిణాదికి ఎలాంటి రక్షణలు కోరకుండా బీజేపీ అస్పష్ట వైఖరిని సమర్థించడం విడ్డూరంగా ఉంది," అని ఆమె అన్నారు. సమాఖ్య సమతౌల్యాన్ని, దక్షిణాది ప్రాతినిధ్యాన్ని, సహకార సమాఖ్య స్ఫూర్తిని కాపాడటమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, మెరుగైన పాలన అందించిన రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించే వ్యవస్థగా భారత ప్రజాస్వామ్యం మారకూడదని షర్మిల స్పష్టం చేశారు. ఈ మేరకు నారా లోకేష్ చేసిన ఓ ట్వీట్ ను ఆమె రీపోస్ట్ చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై ఏపీ మంత్రి నారా లోకేష్, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత చిదంబరంను లక్ష్యంగా చేసుకుని పలు కీలక ప్రశ్నలు సంధించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 ప్రకారం 1971 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ సీట్ల కేటాయింపు జరిగిందని, ఆ నిబంధన 2026 తర్వాత జరిగే తొలి జనాభా గణనతో ముగియనుందని ఆయన గుర్తుచేశారు. ఈ పరిణామం దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు చిదంబరంను ఉద్దేశించి లోకేష్ ట్వీట్ చేశారు.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..





# బ్రిడ్జి శంకుస్థాపన శిలాఫలకం ధ్వంసం.. కేసు నమోదు

- కాల్వపల్లి-పొట్టిమర్రి మధ్య ఘటన
- మాజీ సర్పంచి ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**తొలివెలుగు, రాజాపేట:** మండలం కాల్వపల్లి - పొట్టిమర్రి గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న నూతన బ్రిడ్జి శంకుస్థాపన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. శిలాఫలకంతో కూడిన దిమ్మను పూర్తిగా కూల్చివేయడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రాజాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాల్వపల్లి, పొట్టిమర్రి గ్రామాల మధ్య రాకపోకలను సులభతరం చేసేందుకు ప్రభుత్వం ఇటీవల బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధుల సమక్షంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించి శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. అయితే బుధవారం రాత్రి కొందరు గుర్తుతెలియని దుండగులు ఉద్దేశపూర్వకంగా శిలాఫలకానికి ఏర్పాటు చేసిన దిమ్మను కూల్చివేసి ధ్వంసం చేసినట్లు సమాచారం. గురువారం ఉదయం ఘటనను గమనించిన గ్రామస్థులు మాజీ సర్పంచికి సమాచారం అందించారు. దీంతో కాల్వపల్లి గ్రామ మాజీ సర్పంచి ఇంజ నరసయ్య రాజాపేట పోలీసులకు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడమే కాకుండా గ్రామాల్లో ఉద్రిక్తతలు సృష్టించే ఉద్దేశంతోనే ఈ చర్యకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాజీ సర్పంచి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ఘటనకు బాధ్యులైన వ్యక్తులను గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. శిలాఫలకం ధ్వంసానికి గల కారణాలపై వివిధ కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఉపాధి కూలీలకు పెరుగన్నం, మజ్జిగ పంపిణీ

- వార్డు సభ్యుడు గుర్రం శ్రవణ్ కుమార్ ఉదారత
- అభినందించిన ఇన్‌ఛార్జి ఎంపీడీవో, ఈజీఎస్ ఏపీవో

**తొలివెలుగు, రాజాపేట:** ఎండ తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ పనులకు వస్తున్న కూలీల దాహార్తిని తీర్చేందుకు రాజాపేట మండల కేంద్రానికి చెందిన 8వ వార్డు సభ్యుడు గుర్రం శ్రవణ్ కుమార్ ఉదారత చాటుకున్నారు. శుక్రవారం ఆయన ఉపాధి కూలీలు పనిచేస్తున్న క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లారు. అక్కడ పనుల్లో నిమగ్నమైన కూలీలకు పెరుగన్నం వడ్డించడంతో పాటు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.


**ఆదర్శంగా నిలుస్తున్న సేవలు:**

ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. కఠినమైన ఎండల్లో శ్రమిస్తున్న కూలీలకు కాస్తో కూస్తో ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతోనే ఈ చిన్న ప్రయత్నం చేశానని తెలిపారు. శనివారం కూలీల కోసం ప్రత్యేకంగా నిమ్మరసం పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ శ్రవణ్ కుమార్ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారని స్థానికులు కొనియాడారు. కూలీలకు ఆయన అందించిన ఈ సాయాన్ని రాజాపేట ఇన్‌ఛార్జి ఎంపీడీవో అల్లం ఇన్నారెడ్డి, ఈజీఎస్ ఏపీవో కరుణాకర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాప్రతినిధులు ఇటువంటి సేవా కార్యక్రమాలతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు, మేటీలు పాల్గొన్నారు.



# రాజాపేటలో 'నత్తనడకన' ఇందిరమ్మ ఇళ్లు!

- మండలంలో సగం కంటే తక్కువగా పూర్తయిన నిర్మాణాలు
- జూన్ 2 గడువు సమీపిస్తున్నా మారని పరిస్థితి
- ఎలివేషన్ల పేరిట మేస్త్రీల అదనపు దోపిడీ.. రూ.15 లక్షలకు పెరుగుతున్న వ్యయం




**తొలివెలుగు, రాజాపేట:** పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు రాజాపేట మండలంలో నత్తనడకన సాగుతున్నాయి. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జూన్ 2వ తేదీ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి మారలేదు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 484 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు కేవలం 190 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. మరో 87 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభ దశలోనే ఉండటంతో గడువులోగా పూర్తి కావడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జాల గ్రామంలో 12 ఇళ్లకు గాను కేవలం 2 ఇళ్లు, కొత్తజాలలో 5 ఇళ్లకు గాను ఒక ఇల్లు మాత్రమే పూర్తయ్యాయి. మండల కేంద్రం రాజాపేటలో 41 ఇళ్లకు గాను 15, చల్లూరులో 27 ఇళ్లకు గాను 5, కాల్వపల్లిలో 20 ఇళ్లకు గాను 5, పాముకుంటలో 24 ఇళ్లకు గాను 6, బూరుగుపల్లిలో 28 ఇళ్లకు గాను కేవలం 4 ఇళ్లు మాత్రమే పూర్తి కావడం నిర్మాణాల నెమ్మదితనానికి నిదర్శనంగా నిలుస్తోంది. అయితే రఘునాథపురంలో 43 ఇళ్లకు గాను 27, లక్ష్మక్కపల్లిలో 8 ఇళ్లకు గాను 4 ఇళ్లు పూర్తి చేసి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు మెరుగైన పనితీరు కనబరిచినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కొందరు మేస్త్రీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అంచనాల ప్రకారం రూ.8 లక్షల లోపే నిర్మాణం పూర్తి కావాల్సి ఉండగా, ఎలివేషన్లు, ప్రహరీ గోడలు, అదనపు డిజైన్ల పేరుతో ఖర్చును రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పెంచుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. బూరుగుపల్లిలో మెటీరియల్‌తో కలిపి రూ.8 లక్షలకే నిర్మాణాలు చేపడుతుండగా, ఇతర గ్రామాల్లో రూ.13 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పెరుగుతున్న నిర్మాణ వ్యయం, అప్పుల భారం కారణంగా కొందరు లబ్ధిదారులు పూర్తికాని ఇళ్లలోనే గృహప్రవేశాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు నిర్మాణాలు పూర్తి చేయని లబ్ధిదారులకు భవిష్యత్‌లో ప్రభుత్వ పథకాల అమలులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. జూన్ 2 గడువు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులు, గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం రాజాపేట మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

# షార్ట్ సర్క్యూట్‌తో యూకలిప్టస్ తోటలో మంటలు





- సకాలంలో స్పందించిన పెట్రోలింగ్ పోలీసులు
- గ్రామ పంచాయతీ ట్యాంకర్, ఫైర్ ఇంజన్‌తో మంటలు అదుపు.. తప్పిన భారీ నష్టం

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని నమిల గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి ఓ యూకలిప్టస్ తోటలో మంటలు చెలరేగాయి. పోలీసులు, స్థానిక రైతులు సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో భారీ ఆస్తి నష్టం తప్పింది.

**పెట్రోలింగ్ సిబ్బంది సమయస్ఫూర్తి:**

పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నమిల గ్రామానికి చెందిన రైతు మహేందర్ రెడ్డికి చెందిన పొలంలో యూకలిప్టస్ తోట ఉంది. శుక్రవారం మధ్యాహ్నం తోట మీదుగా వెళ్తున్న విద్యుత్ తీగలు ఒకదానికొకటి తాకడంతో షార్ట్ సర్క్యూట్ అయి నిప్పురవ్వలు తోటలో పడ్డాయి. ఎండ తీవ్రతకు తోటలోని ఎండుటాకులు, చెట్లు ఒక్కసారిగా అంటుకుని మంటలు వేగంగా వ్యాపించాయి. అదే సమయంలో రాజాపేట ఎస్ఐ లింగారెడ్డి ఆదేశాల మేరకు ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది భానోత్ రాజు నాయక్, సుదర్శన్ లు తోటలో నుంచి పొగలు, మంటలు రావడం గమనించారు. వారు వెంటనే అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

**యూత్, ఫైర్ సిబ్బంది సహకారం:**

మంటలు పక్క పొలాలకు వ్యాపించకుండా పెట్రోలింగ్ పోలీసులు సమీపంలోని రైతులను, యువకులను సమకూర్చారు. వెంటనే నమిల గ్రామ పంచాయతీకి చెందిన నీళ్ల ట్యాంకర్‌ను అక్కడికి రప్పించి మంటలపై నీళ్లు చల్లారు. అనంతరం సమాచారం అందుకున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది కూడా ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. సకాలంలో పోలీసులు స్పందించి శ్రమించడంతో చేతికొచ్చిన యూకలిప్టస్ తోట కాలిబూడిద కాకుండా కాపాడగలిగారు. నష్టం తీవ్రత తగ్గడంతో బాధితుడు మహేందర్ రెడ్డితో పాటు గ్రామస్థులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ముఖ్యమంత్రి పర్యటనతో ఆలేరుకు మహర్దశ

- రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రాజాపేట మండల కాంగ్రెస్ సీనియర్ నేత మేడిశెట్టి సురేందర్ వెల్లడి



**తొలివెలుగు, రాజాపేట:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట పర్యటనతో ఆలేరు నియోజకవర్గానికి మహర్దశ రానుందని, ఈ ప్రాంతం మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేడిశెట్టి సురేందర్ అన్నారు. శుక్రవారం ఆయన రాజాపేటలో విలేఖరులతో మాట్లాడారు.

**ప్రత్యేక నిధుల మంజూరు:**

ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య చొరవతో యాదగిరిగుట్ట పరిధిలో వంద కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారని సురేందర్ తెలిపారు. నియోజకవర్గ ప్రజలు, భక్తుల తరఫున ఆయన ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నియోజకవర్గ ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆలేరు పరిధిలోని రాజాపేటతో పాటు అన్ని మండలాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయించేందుకు ఆయన చేస్తున్న కృషి అమోఘం."

**మేడిశెట్టి సురేందర్, కాంగ్రెస్ నేత**

సీఎం పర్యటన తర్వాత రాజాపేట మండలంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలకు పరిష్కారం దొరకడమే కాకుండా, నూతన అభివృద్ధి పనులకు నిధుల వరద పారనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఇసుక అక్రమ రవాణాపై తహసిల్దార్ దాడి

- రాత్రి వేళల్లో నిఘా.. రెండు ట్రాక్టర్ల పట్టివేత
- పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు.. తహసిల్దార్ బృందానికి అభినందనలు

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ యంత్రాంగం నిఘా తీవ్రం చేసింది. నమ్మదగిన సమాచారంతో తహసిల్దార్ వల్లపు ప్రదీప్ నేతృత్వంలోని బృందం గురువారం అర్ధరాత్రి దాడి నిర్వహించి, రఘునాథపురం వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుంది.

**పోలీసులు, రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం..**

రాజాపేట మండలంలోని రఘునాథపురం వాగు నుంచి కొంతకాలంగా రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తహసిల్దార్ వల్లపు ప్రదీప్‌కు సమాచారం అందింది. దీంతో ఆయన తన సిబ్బందితో కలిసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. రాత్రి వేళలో వాగులో ఇసుక లోడ్ చేసుకుని వెళ్తున్న రెండు ట్రాక్టర్లను అధికారులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఆ వాహనాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆ ట్రాక్టర్లను రాజాపేట పోలీస్ స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించారు.

**కేసు నమోదు.. దర్యాప్తు**

ఈ ఘటనపై జీపీవో (గజ్వేల్) కవిత ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు మేరకు రాజాపేట ఎస్ఐ లింగారెడ్డి కేసు నమోదు చేశారు. యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన డ్రైవర్లు పూర్మ రాజేష్, వేముల చందులు ట్రాక్టర్ యజమాని బెదరబోయిన రాములు సూచనల మేరకు ఈ అక్రమ రవాణాకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఇసుక మాఫియాను అడ్డుకునేందుకు ప్రాణాలకు తెగించి రాత్రి వేళల్లో సాహసోపేతంగా దాడులు నిర్వహిస్తున్న తహసిల్దార్ వల్లపు ప్రదీప్ సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు ఆయన కృషిని అభినందించారు.

# ఆకులకుంటకు జలకళ.. చేరిన కృష్ణమ్మ నీళ్లు

- ప్రభుత్వ విప్ వేముల వీరేశం చొరవతో నీటి మళ్లింపు
- రైతులు, పశుపక్షాదులకు ఉపశమనం



**తొలివెలుగు, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కొమ్మాయిగూడెం గ్రామ పరిధిలోని ఆకులకుంట గురువారం జలకళ సంతరించుకుంది. వేసవి తీవ్రతతో పూర్తిగా ఎండిపోయిన కుంటలోకి తెలంగాణ ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక చొరవతో కృష్ణా జలాలను మళ్లించారు. స్థానిక సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి ఆధ్వర్యంలో నీటి మళ్లింపు పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ.. తీవ్ర ఎండల కారణంగా గ్రామ శివార్లలోని చెరువులు, కుంటలు ఎండిపోవడంతో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం స్పందించి ఆకులకుంటకు నీటిని మళ్లించడం గ్రామానికి ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. కుంటలో నీరు చేరడం వల్ల పరిసర ప్రాంతాల బావులు, బోరుబావుల్లో నీటి మట్టాలు పెరిగే అవకాశం ఉందని, పశుపక్షాదుల దాహార్తి తీరడంతో పాటు రైతులకు సాగునీటి సమస్యలు కూడా కొంతవరకు తగ్గుతాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు, రైతుల తరఫున ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తీర్పాల ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గురజాల రాంరెడ్డి, బాలగోని గణేష్, కొండగడప శంకరయ్య, రేపాక అశోక్, నవీన్, సీపీఎం సీనియర్ నాయకులు శానగొండ వెంకటాచారి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వీరమల్ల పరుశురాం తదితరులు పాల్గొన్నారు. ఆకులకుంటలోకి నీరు చేరడంతో గ్రామ రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా జల్లెల పెంటయ్య



**తొలివెలుగు, రామన్నపేట :** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా జల్లెల పెంటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం జిల్లా మహాసభల్లో ప్రతినిధులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన జల్లెల పెంటయ్య ఒక నిరుపేద గొర్రెల కాపరి కుటుంబంలో జన్మించారు. ఐడియాల్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తూ కార్మిక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న ఆయన, సీఐటీయూ యూనియన్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1998లో సీపీఎం పార్టీలో సభ్యత్వం తీసుకున్న అనంతరం రామన్నపేట-నకిరేకల్ డివిజన్ కమిటీ సభ్యుడిగా, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శిగా, గొర్రెలు-మేకల పెంపకందారుల సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా పలు బాధ్యతలు నిర్వహించారు. 2006 నుంచి 2022 వరకు సీపీఎం మండల కార్యదర్శిగా పనిచేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా కమిటీ సభ్యుడిగా, అనంతరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడిగా కొనసాగిన పెంటయ్య ప్రస్తుతం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కూడా సేవలందిస్తున్నారు. మండల వ్యాప్తంగా కూలీల సమస్యలు, భూమి పోరాటాలు, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, నివాస గృహాల సాధన కోసం అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా జల్లెల పెంటయ్య మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని, కూలీల హక్కుల పరిరక్షణకు సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికుల సంక్షేమం, ఉపాధి హామీ కార్మికుల సమస్యలు, భూమిలేని పేదల హక్కుల సాధన కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండలంలోని సంగెం గ్రామంలో మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి పరామర్శించారు. గ్రామానికి చెందిన గంగాపురం అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, శుక్రవారం సురకంటి మురళీధర్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన పాలెం రాములమ్మ ఇటీవల మృతి చెందగా, ఆమె దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న సురకంటి మురళీధర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన ఆయన, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగెం గ్రామ సర్పంచ్ తాడూరి లలిత - లింగస్వామి, సురకంటి చంద్రారెడ్డి, జక్కల వెంకటేశం, వరికుప్పల మల్లేశం, ఉండాడి వెంకటేశం, కాసుల శ్రీకాంత్, జక్కల బిక్షపతి, చిలకల మహేష్, బాతరాజు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# అగ్నిప్రమాదంలో నిమ్మతోట దగ్ధం.. బాధిత రైతును ఆదుకోవాలి





- ఇస్కిళ్ల గ్రామంలో ఘటన.. 45 నిమ్మ చెట్లు అగ్నికి ఆహుతి
- నష్టపోయిన రైతుకు పరిహారం అందించాలని రైతు సంఘం డిమాండ్

**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని ఇస్కిళ్ల గ్రామంలో అగ్నిప్రమాదానికి గురై తీవ్రంగా నష్టపోయిన నిమ్మతోట రైతును ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జరిగిన ఈ ఘటనలో సుమారు 45 నిమ్మ చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న రైతు సంఘం నాయకులు ఘటనా స్థలాన్ని సందర్శించి నష్టాన్ని పరిశీలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు గన్నెబోయిన విజయభాస్కర్ తన వ్యవసాయ భూమిలో సుమారు 90 నిమ్మ చెట్లను పెంచుతూ సాగు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు తోటలో నిప్పు అంటుకోవడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చినా అప్పటికే సుమారు 45 నిమ్మ చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ సందర్భంగా మేక అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒక్కో నిమ్మ చెట్టు ద్వారా రైతుకు సంవత్సరానికి సుమారు రూ.10 వేల వరకు ఆదాయం లభిస్తుందని తెలిపారు. చేతికొచ్చే పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతు విజయభాస్కర్ తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యానవన శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నష్టాన్ని అంచనా వేసి ప్రతి దగ్ధమైన చెట్టుకు రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే రైతు తీసుకున్న పంట రుణాన్ని పూర్తిగా మాఫీ చేసి, తిరిగి కొత్త రుణాన్ని మంజూరు చేయాలని కోరారు. నష్టపోయిన తోట పునరుద్ధరణకు ఉచితంగా నిమ్మ మొక్కలు పంపిణీ చేయడంతో పాటు పురుగుమందుల కొనుగోలుకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య, మాజీ నీటి సంఘం చైర్మన్ మేడబోయిన శ్రీనివాస్, పల్లె సత్యం, మార్త భూపాల్‌రెడ్డి, గన్నెబోయిన సింహాచలం, చిన్నబోయిన సత్యనారాయణ తదితరులు ఉన్నారు. రైతుకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**తొలివెలుగు, చౌటుప్పల్:** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కును శుక్రవారం చౌటుప్పల్‌లోని లాక్కారం క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుడికి అందజేశారు. మండలంలోని తూప్రాన్‌పేట్ గ్రామానికి చెందిన పగడాల సతీష్‌కు రూ.36 వేల ఆర్థిక సహాయం మంజూరుకాగా, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సిఫారసుతో విడుదలైన చెక్కును చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుర్వి నరసింహాగౌడ్, తూప్రాన్‌పేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెంచల శ్రీనివాస్, బూత్ కన్వీనర్ గంధం ఆంజనేయులు సంయుక్తంగా అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయం నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చెన్నగోని అంజయ్య, జల్లా మల్లేష్, వర్కారి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



## రాజగోపాల్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

- ఆధారాలు ఉంటే బహిరంగ చర్చకు రావాలి: మౌనిక గౌడ్




**తొలివెలుగు, చౌటుప్పల్:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను వెంటనే నిలిపివేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దగోని మౌనిక గౌడ్ డిమాండ్ చేశారు. ఆరోపణలకు ఆధారాలు ఉంటే బహిరంగ చర్చకు రావాలని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ.. ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తున్న నాయకులపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. కష్టపడి ప్రజల మధ్య గుర్తింపు పొందుతున్న బీసీ నాయకులను కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చారని, అందువల్లే ప్రస్తుతం ప్రతి అంశాన్ని అదే దృష్టితో చూస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పారదర్శక పాలన అందిస్తోందని పేర్కొన్నారు. మునుగోడు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఆధారాలు లేని ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా లేదా ఇతర మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారాలు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని మౌనిక గౌడ్ హెచ్చరించారు.

# మృత్యువు అంచుల్లోంచి గర్భిణి సురక్షితం.. మలక్‌పేట 'యశోద' వైద్యుల అద్భుతం!

- గర్భాశయ గోడను చీల్చుకుపోయిన ప్లాసెంటా
- పొత్తికడుపులో 3 లీటర్ల రక్తస్రావం.. మహిళకు పునర్జన్మ ప్రసాదించిన డాక్టర్లు
- అత్యవసర శస్త్రచికిత్స, రక్త మార్పిడి, ఐసీయూ చికిత్సతో ప్రాణరక్షణ

**తొలివెలుగు, చౌటుప్పల్:**

అత్యంత అరుదైన, ప్రాణాంతకమైన 'ప్లాసెంటా పర్‌క్రెటా' కారణంగా గర్భాశయం చీలిపోయి తీవ్ర అంతర్గత రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న గర్భిణికి మలక్‌పేట్‌లోని యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యబృందం విజయవంతంగా చికిత్స అందించి ప్రాణాలు కాపాడింది. బహుళ విభాగాల నిపుణుల సమన్వయంతో నిర్వహించిన అత్యవసర శస్త్రచికిత్స, ఐసీయూ పర్యవేక్షణ, రక్త మార్పిడి చికిత్సలతో రోగి పూర్తిగా కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు వైద్యులు వెల్లడించారు. వైద్యుల వివరాల ప్రకారం.. 28 వారాల 6 రోజుల గర్భిణి అయిన 27 ఏళ్ల మహిళ తీవ్ర కడుపు నొప్పి, గుండెదడ, వాంతుల భావన, తల తిరగడం, శిశువు కదలికలు తగ్గిపోవడం వంటి లక్షణాలతో అత్యవసరంగా ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రికి చేరుకునే సమయానికి ఆమె తీవ్ర రక్తనష్టం కారణంగా హేమరేజిక్ షాక్‌తో పాటు శ్వాస సంబంధిత సమస్యలతో ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. తక్షణమే నిర్వహించిన సీటీ స్కాన్, ఇతర వైద్య పరీక్షల్లో ప్లాసెంటా పర్‌క్రెటా కారణంగా గర్భాశయం చీలిపోవడం, పొత్తికడుపులో భారీ రక్తస్రావం జరగడం, గర్భంలోని శిశువు మరణించడం, హేమరేజిక్ షాక్‌తో పాటు టైప్-1 రెస్పిరేటరీ ఫెయిల్యూర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో



డా. ఎం.వి. జ్యోత్స్న నేతృత్వంలోని ప్రసూతి, క్రిటికల్ కేర్, అనస్థీషియా, జనరల్ మెడిసిన్, బ్లడ్ బ్యాంక్ నిపుణుల బృందం వెంటనే చికిత్స ప్రారంభించింది. రోగిని స్థిరీకరించేందుకు ఐవీ ఫ్లూయిడ్స్, నోరాడ్రినలిన్ ఇన్ఫ్యూషన్, రక్తం మరియు రక్త ఉత్పత్తుల మార్పిడి, ఐసీయూ పర్యవేక్షణ చేపట్టారు. అనంతరం అత్యవసరంగా లాపరోటమీ, మృత శిశువు డెలివరీ, సర్వికల్ సెర్క్లేజ్ తొలగింపు వంటి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స సమయంలో సుమారు 2.5 నుంచి 3 లీటర్ల వరకు అంతర్గత రక్తస్రావం జరిగినట్లు గుర్తించారు. గర్భాశయం ఎడమ భాగంలో 4x4 సెంటీమీటర్ల మేర చీలిక ఏర్పడి, ఆ ప్రాంతంలో ప్లాసెంటా గర్భాశయ గోడను దాటి అతుక్కుపోయినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం గర్భాశయ చీలికను విజయవంతంగా మరమ్మతు చేసి రక్తస్రావాన్ని అదుపులోకి తీసుకువచ్చారు. శస్త్రచికిత్స అనంతరం ఐసీయూలో ప్రత్యేక పర్యవేక్షణ, యాంటీబయోటిక్స్, ఆక్సిజన్ సపోర్ట్, నొప్పి నివారణ చికిత్స అందించగా రోగి క్రమంగా కోలుకుని ఆరోగ్యంగా మారినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. ఎం.వి. జ్యోత్స్న మాట్లాడుతూ.. ప్లాసెంటా పర్‌క్రెటా వల్ల గర్భాశయం చీలిపోవడం అత్యంత ప్రమాదకరమైన ప్రసూతి అత్యవసర పరిస్థితి అని తెలిపారు. ఇటువంటి సందర్భాల్లో తక్షణ నిర్ధారణ, అత్యవసర శస్త్రచికిత్స, రక్త మార్పిడి, ఐసీయూ చికిత్స ఎంతో కీలకమని పేర్కొన్నారు. క్రిటికల్ కేర్ విభాగాధిపతి డా. కలాధర్ ఎస్ మాట్లాడుతూ.. తీవ్ర రక్తస్రావం, హేమరేజిక్ షాక్‌తో వచ్చే రోగులకు తక్షణ స్థిరీకరణ, రక్త మార్పిడి, ఆక్సిజన్ సపోర్ట్, నిరంతర పర్యవేక్షణ ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కేసు ద్వారా అరుదైన ప్రసూతి అత్యవసర పరిస్థితిని వేగంగా గుర్తించడం, అధునాతన ఇమేజింగ్ సాంకేతికతతో సరైన నిర్ధారణ చేయడం, భారీ రక్తస్రావాన్ని నియంత్రించడం, బహుళ విభాగాల సమన్వయంతో ప్రాణరక్షక చికిత్స అందించడం వంటి అంశాలు మరోసారి రుజువయ్యాయని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, సమగ్ర అత్యవసర వైద్య సేవలతో హైరిస్క్ గర్భధారణలు, క్లిష్ట వైద్య పరిస్థితులకు అత్యుత్తమ చికిత్స అందిస్తున్నామని తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో నాణ్యమైన, సురక్షితమైన వైద్య సేవలను అందించడంలో ఆసుపత్రి ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.

# రాజగోపాల్‌రెడ్డిపై 'పింక్' ఏడ్పులు.. చేతనైతే డైరెక్ట్‌గా తలపడండి!

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు చేస్తే సహించం
- బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ శ్రేణుల హెచ్చరిక
- ఆధారాలు ఉంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్
- చౌటుప్పల్ క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ ముఖ్య నేతల విలేకరుల సమావేశం




**తొలివెలుగు, చౌటుప్పల్:** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పబ్బు రాజుగౌడ్‌లపై బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా చేస్తున్న అసత్య, నిరాధార ప్రచారాలను కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ శాఖల నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం చౌటుప్పల్ పట్టణంలోని ఎమ్మెల్యే వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అవినీతి మచ్చలేని నాయకుడిగా, మునుగోడు అభివృద్ధి ప్రదాతగా పేరు తెచ్చుకున్న రాజగోపాల్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేకనే బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు తెరలేపారని మండిపడ్డారు. ఒక బీసీ సామాజికవర్గానికి చెందిన నాయకుడు కష్టపడి పైకి ఎదుగుతుంటే బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని ఆరోపించారు. సొంతంగా కష్టపడి సంపాదించుకున్న ఆర్థిక బలంతో ఒక కారు కొనుగోలు చేస్తే, దానిపై కూడా కుటిల బుద్ధితో అసత్యాలు ప్రచారం చేయడం వారి మానసిక స్థితికి అద్దం పడుతోందన్నారు. 'పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది' అన్న చందంగా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాము చేసిన అవినీతి, అక్రమాలను మనసులో ఉంచుకుని, కాంగ్రెస్ నాయకులపై బురదజల్లుతున్నారని ఎద్దేవా చేశారు. రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో మునుగోడు నియోజకవర్గంలో అవినీతికి తావులేదని స్పష్టం చేశారు. ప్రచారాల్లో నిజముంటే ఆధారాలతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఇటువంటి పెయిడ్ ఛానెళ్లు, పెయిడ్ సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా ఇకపైనా దుష్ప్రచారం సాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి నర్సింహగౌడ్, , మున్సిపాలిటీ మాజీ ప్రెసిడెంట్ మొగుదాల రమేష్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# టాపర్‌ను పడగొట్టినా..

## థర్డ్ ప్లేసే.. ఆఖరాటలో దంచికొట్టిన సన్‌రైజర్స్



**నువ్వు ఫోర్ కొడితే నేను సిక్స్ కొడతా అన్నట్టు సొంతగడ్డపై ఆఖరాటలో సన్‌రైజర్స్ బ్యాటర్లు దంచికొట్టాడు. ఆర్సీబీ బౌలింగ్‌ను ఉతికేస్తూ పరుగుల మోతతో ఉప్పల్ స్టేడియాన్ని ఊపేశారు. దాంతోలీగ్‌లో మరే జట్టుకు సాధ్యంకాని రీతిలో హైదరాబాద్ ఆరోసారి 250 ప్లస్ స్కోరు చేసింది. ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో తమను ఓడించిన బెంగళూరుపై గెలిచి ప్రతీకారం తీర్చుకుంది. అయినా టాప్-2లో నిలిచేంత భారీ విజయం సాధించలేకపోయిన సన్‌రైజర్స్ మూడో స్థానంతో సరిపెట్టింది. ఆఖరాటలో ఓడినా.. మెరుగైన రన్‌రేట్‌తో ఆర్సీబీ టాప్ ప్లేస్ నిలబెట్టుకుంది.**



హైదరాబాద్: ఐపీఎల్19వ సీజన్ లీగ్ దశను సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయంతో ముగించింది. ఇషాన్ కిషన్ (46 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 79), అభిషేక్ శర్మ (22 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 56), హెన్రిచ్ క్లాసెన్ (24 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 51) విజృంభించడంతో ఉప్పల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 55 పరుగుల తేడాతో ఆర్సీబీని ఓడించింది. తొలుత హైదరాబాద్ 255/4 స్కోరు చేసింది. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ సహా ముగ్గురు 50 ప్లస్ రన్స్ ఇచ్చుకున్నారు. అనంతరం ఛేదనలో ఆర్సీబీ ఓవర్లన్నీ ఆడి 200/4 చేసి ఓడింది. కెప్టెన్ రజత్ పాటిదార్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 56), వెంకటేశ్ అయ్యర్ (19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 44) జట్టు భారీ తేడాతో ఓడిపోకుండా చూసి టాప్ ప్లేస్ ఖాయం చేశారు. ఇషాన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఆర్సీబీ, గుజరాత్, హైదరాబాద్ తలో 18 పాయింట్లతో నిలిచినా.. రన్‌రేట్‌లో వెనుకబడిన హైదరాబాద్ మూడో స్థానానికి పరిమితం అయింది. ఆర్సీబీ, జీటీ ఈ నెల 26న క్వాలిఫయర్-1 ఆడనుండగా.. నాలుగో స్థానంలో నిలిచే జట్టుతో 27న రైజర్స్ ఎలిమినేటర్‌లో పోటీ పడుతుంది.

### ఒకరిని మించి మరొకరు

క్రీజులోకి వచ్చిన బ్యాటర్లంతా పరుగుల వేటలో పోటీ పడటంతో హైదరాబాద్ మరోసారి భారీ స్కోరు చేసింది. ఫ్లాట్ వికెట్‌పై ఆర్సీబీ బౌలర్లంతా తేలిపోవడంతో ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిసింది. గత రెండు మ్యాచ్‌ల్లో అంతగా ఆకట్టుకోలేకపోయిన ఓపెనర్ అభిషేక్ మళ్లీ ఫామ్ అందుకొని బలమైన పునాది వేశాడు. భువీ వేసిన తొలి ఓవర్లోనే సిక్సర్ల ఖాతా తెరిచి తన ఉద్దేశం ఏంటో చెప్పాడు. నాలుగో ఓవర్లో నాలుగు ఫోర్లు కొట్టిన మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (26)ను రసిఖ్ ధార్ ఓ యార్కర్‌తో క్లీన్ బౌల్డ్ చేసి ఆర్సీబీ బ్రేక్ ఇచ్చాడు. రసిఖ్ తర్వాతి ఓవర్లో ఇచ్చిన క్యాచ్‌ను వెంకటేశ్ అయ్యర్ డ్రాప్ చేయడంతో బతికిపోయిన అభి.. ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకున్నాడు. 63/1తో పవర్ ప్లే ముగిసిన తర్వాత ఓ ఎండ్‌లో ఇషాన్‌ను నిలబెట్టి భారీ షాట్లతో విజృంభించాడు. స్పిన్నర్ సుయాశ్, పేసర్ రొమారియోను టార్గెట్ చేసి రెండేసి సిక్సర్లు కొట్టిన అతను 20 బంతుల్లో అర్ధ శతకం అందుకున్నాడు. సుయాశ్ వేసిన తొమ్మిదో ఓవర్లో మరో షాట్‌కు ప్రయత్నించి జోర్డన్ కాక్స్‌కు క్యాచ్ ఇచ్చినా ఆర్సీబీకి పెద్దగా ఉపశమనం దక్కలేదు. అదే ఓవర్‌లో ఫోర్‌తో స్కోరు వంద దాటించిన ఇషాన్‌తో పాటు క్లాసెన్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకున్నారు. సూపర్ ఫామ్‌లో ఉన్న క్లాసెన్.. హేజిల్‌వుడ్ వేసిన 13వ ఓవర్లో మూడు సిక్సర్లు, ఓ ఫోర్‌తో రెచ్చిపోయిన ఏకంగా 27 రన్స్ రాబట్టి స్కోరు 150 దాటించాడు. మరో ఎండ్‌లో ఇషాన్ కూడా భారీ షాట్లు కొడుతూ 31 బంతుల్లో ఫిఫ్టీ మార్కు దాటాడు. తర్వాత మరింత జోరు పెంచిన అతను రసిఖ్ బౌలింగ్‌లో 6, 4, 4 కొట్టగా.. తన ధాటిని కొనసాగించిన క్లాసెన్ 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకున్నాడు. వీళ్ల జోరుకు 16 ఓవర్లకే స్కోరు 200 దాటింది. తర్వాతి ఓవర్లో స్పిన్నర్ కృనాల్ పాండ్యా.. క్లాసెన్‌ను ఔట్ చేసి రెండో మూడో వికెట్‌కు 113 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని ముగించాడు. కానీ, తర్వాతి రెండు బాల్స్‌ను స్టాండ్స్‌కు పంపిన నితీశ్ (29లి) హేజిల్‌వుడ్ ఓవర్లో మరో సిక్స్‌తో అలరించాడు. చివరి రెండు ఓవర్లలో ఆర్సీబీ బౌలర్లు వరుసగా 8, 9 పరుగులే ఇచ్చి ఆఖరి బంతికి ఇషాన్‌ను ఔట్ చేసినా హైదరాబాద్ 250 మార్కు దాటింది.

### బౌలర్ల కట్టడి..

భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీని 166 పరుగుల్లోపు కట్టడి చేస్తే టాప్-2లో నిలిచే అవకాశం ఉన్నా.. రైజర్స్‌కు ప్రత్యర్థి ఆ చాన్స్ ఇవ్వలేదు. ఛేదనను బెంగళూరు ధాటిగానే ఆరంభించింది. తొలి ఓవర్లోనే కమిన్స్‌కు ఫోర్, సిక్స్‌తో స్వాగతం పలికిన ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్ పవర్ ప్లేలో మెరుపులు మెరిపించాడు. స్పిన్నర్ శివంగ్ వేసిన నాలుగో ఓవర్లో 6,4,6,6తో చెలరేగి స్కోరు యాభై దాటించాడు. కానీ, తర్వాతి ఓవర్లో మళ్లీ బౌలింగ్‌కు వచ్చిన ఈషాన్ మలింగ అతడిని ఔట్ చేసి ఆర్సీబీని తొలి దెబ్బకొట్టాడు. తర్వాతి ఓవర్లో విరాట్ కోహ్లీ (15)ని సాకిబ్ పెవిలియన్ చేర్చడంతో అతని ఫ్యాన్స్ అంతా షాకయ్యారు. రెండు ఫోర్లు, ఓ సిక్స్‌తో దూకుడుగా ఆడుతున్న పడిక్కల్ (21)ను తొమ్మిదో ఓవర్లో మలింగ పెవిలియన్ చేర్చడంతో ఆర్సీబీ 94/3తో నిలిచింది. ఇక్కడి నుంచి ఆతిథ్య బౌల కట్టుదిట్టమైన బంతులు వేయడంతో కెప్టెన్ రజత్, కృనాల్ పాండ్యా (41 నాటౌట్) వేగంగా ఆడలేకపోయారు. ఫలితంగా సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరిగింది. ఒత్తిడిలోనూ క్రమం తప్పకుండా బౌండరీలు కొట్టిన రజత్ అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. జట్టు టాప్ ప్లేస్‌ను ఖాయం చేసిన తర్వాత 19వ ఓవర్లో పార్ట్‌టైమ్ స్పిన్నర్ హెడ్‌కు వికెట్ ఇచ్చుకున్నాడు. చివరి ఓవర్లో 6,4 కొట్టిన టిమ్ డేవిడ్ (15 నాటౌట్) స్కోరు 200 దాటించాడు.

### పోటెత్తిన అభిమానం

నగరంలో ఆఖరి మ్యాచ్.. స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ బరిలో నిలవడంతో ఈ మ్యాచ్‌కు అభిమానులు పోటెత్తారు. రికార్డు స్థాయిలో 36 వేల పైచిలుకు ఫ్యాన్స్‌తో స్టేడియం కిక్కిరిసిపోయింది. మెజారిటీ ఫ్యాన్స్ ఆర్సీబీ, కోహ్లీ జెర్సీలతో కనిపించారు. గ్రౌండ్‌లో విరాట్ కనిపించినప్పుడల్లా కేరింతలు కొట్టారు. ఆర్సీబీ.. ఆర్సీబీ, కోహ్లీ.. కోహ్లీ నినాదాలతో హోరెత్తించారు. బ్యాటింగ్‌లో కోహ్లీ తక్కువ స్కోరుకే ఔటై నిరుత్సాహపరిచినా.. సన్‌రైజర్స్ ఖతర్నాక్ బ్యాటింగ్‌ను అభిమానులు ఆస్వాదించారు.



# స్వాములవారి లింగోటం కాలనీవాసుల తాగునీటి కష్టాలకు 'చెక్'!

- స్వచ్ఛమైన నీటి ప్లాంట్‌ను ప్రారంభించిన సర్పంచ్ ప్రదీప్ జీ
- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో అభివృద్ధి పనులు ముమ్మరం
- సూర్య ఆగ్రో ఫామ్స్ దాతృత్వానికి జనం జేజేలు

**తొలివెలుగు, చౌటుప్పల్:** మండల పరిధిలోని స్వాములవారి లింగోటం గ్రామం ఉదయగిరి కాలనీలో స్థానిక ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను శుక్రవారం గ్రామ సర్పంచ్ బీమిడి ప్రదీప్ జీ రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. అనంతరం కాలనీవాసులకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరాను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ బీమిడి ప్రదీప్ జీ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ పాలకవర్గం పనిచేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో స్థానిక ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తున్నామని, అందులో భాగంగానే ఈ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారం, ఆశీస్సులతో స్వాములవారి లింగోటం గ్రామంలో రాబోయే రోజుల్లో మరిన్ని మౌలిక వసతుల కల్పన పనులను చేపడతామన్నారు. కాలనీ ప్రజల తాగునీటి ఇబ్బందులను గుర్తించి, ప్లాంట్ ఏర్పాటుకు ఉదారంగా ఆర్థిక సహకారం అందించిన సూర్య ఆగ్రో ఫామ్స్ యాజమాన్యానికి గ్రామ పంచాయతీ, ప్రజల తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాతరాజు ధనుంజయ్య, వార్డు సభ్యుడు రాదారపు సత్తయ్య, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, దేవస్థానం చైర్మన్ కుర్నాల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చేవెళ్లి కృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పరి సాయికుమార్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎర్ర విక్రమ్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గంగాపురం నరహరి, మాజీ ఉపసర్పంచ్ గంగాపురం గంగాధర్‌తో పాటు గ్రామ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.


# 109 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో ఆర్థిక సాయం



**తొలివెలుగు, చౌటుప్పల్:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 109 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. చౌటుప్పల్ సమీపంలోని లక్కారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న ఆర్థిక సాయం ఎంతో ఉపయుక్తంగా మారుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు తమ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి నరసింహాగౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు మొగుదాల రమేష్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేయింటర్ దారుణ హత్య




జవహర్‌నగర్, మే 22: పేయింటర్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో సైదులు తెలిపిన కథనం ప్రకారం గోరఖ్‌పూర్ నుంచి నగరానికి వలస వచ్చి జవహర్‌నగర్‌లో అనిల్ కుమార్ (43) నివాసముంటున్నాడు. పేయింటింగ్ కాంట్రాక్టర్‌గా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా అనిల్ కుమార్ నివసించే గదిలో నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించా రు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులుడ పరిశీలించగా కుళ్ళిన స్థితిలో మృతదేహం కనిపించింది. అనిల్‌కుమార్ స్నేహితులతో కలిసి మద్యం తాగిన ఆనవాళ్ళు కనిపిస్తున్నాయనిడ ఆర్థిక తగాదాలా లేక ఇతరత్రా కారణాలతో హత్యకు దారి తీసి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానాకు తరలించారు. ఇంటి యజమాని అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..





## ఆయనే నాకు సెకండ్ లైఫ్ ఇచ్చారు: వరలక్ష్మి శరత్ కుమార్

### డైరెక్టర్ గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన వరలక్ష్మి

తన విలక్షణ నటనతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకున్న నటి వరలక్ష్మి శరత్‌కుమార్. సీనియర్ నటుడు శరత్ కుమార్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి వచ్చిన వరలక్ష్మి... ఆ తర్వాత ఇండస్ట్రీలో తన కాళ్లపై తాను నిలబడింది. ఇప్పుడు దర్శకురాలిగా తన సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించింది. డైరెక్టర్ గా తన మొదటి చిత్రం 'సరస్వతి'తో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ... "డైరెక్టర్ గోపీచంద్ మలినేని సార్ నా గురువు, మెంటార్, గైడ్. ఆయన కారణంగానే నేను ఈ రోజు ఇక్కడ ఉన్నాను. ఆయనే నాకు సెకండ్ లైఫ్ ఇచ్చారు" అంటూ ఆమె భావోద్వేగానికి గురైంది. ఇండస్ట్రీలో అమ్మాయిలు సర్వైవ్ అవడం చాలా కష్టమని, వారికి సపోర్ట్ ఇవ్వాలని ఆమె కోరింది. కనబడకుండా పోయిన కూతురి కోసం ఒక అమ్మ ఎంత దూరం వెళుతుందో చూపించే కథాంశంతో 'సరస్వతి' తెరకెక్కుతోంది. ఈ సినిమాలో వరలక్ష్మితో పాటు ప్రియమణి, ప్రకాశ్ రాజ్ తదితరులు నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. దోసా డైరీస్ బ్యానర్ పై ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# బెంగళూరులో ఏఎంబీ సినిమాస్... డాల్బీ విజన్ ఆస్వాదించిన మహేశ్ బాబు

### తమ కలలను సాకారం చేస్తున్న ఏఎంబీ బృందాన్ని చూసి గర్వంగా ఉందన్న మహేశ్





టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు ఇటీవల బెంగళూరులో పర్యటించారు. అక్కడ కొత్తగా ప్రారంభమైన తమ ఏఎంబీ సినిమాస్ మల్టీప్లెక్స్‌ను ఆయన సందర్శించారు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా డాల్బీ విజన్ టెక్నాలజీతో ఏర్పాటైన ఈ థియేటర్‌లో సినిమా చూసి అద్భుతమైన అనుభూతిని పొందానని వెల్లడించారు. ఈ సందర్భంగా తనపై అభిమానులు చూపిన ప్రేమకు ముగ్ధుడైన మహేశ్, తన సంతోషాన్ని సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. "సౌత్ ఇండియాలోనే మొదటి డాల్బీ విజన్‌ను మా ఏఎంబీ సినిమాస్ బెంగళూరులో అనుభవించడం చాలా ప్రత్యేకంగా అనిపించింది. నన్ను చూడటానికి ఎంతో దూరం నుంచి వచ్చిన అభిమానులను కలవడం కూడా అంతే సంతోషాన్నిచ్చింది. బెంగళూరు చూపిన ఈ ప్రేమకు నేను వినమ్రుడినయ్యాను. గాలి నిండా ప్రేమే నిండిపోయింది" అని మహేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా, తమ కలలను సాకారం చేయడానికి అహర్నిశలు శ్రమించిన ఏఎంబీ సినిమాస్ బృందాన్ని చూసి గర్వంగా ఉందని ప్రశంసించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఏఎంబీ సినిమాస్ విజయవంతంగా నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు బెంగళూరులోనూ తమ బ్రాంచ్‌ను విస్తరించడం ద్వారా మహేశ్ బాబు వ్యాపార రంగంలో మరో ముందడుగు వేశారు. ఈ పర్యటనకు సంబంధించిన ఫొటోలు, మహేశ్ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## గేమ్‌మాస్టర్ ఎవరు?

'మీరు నా నుంచి ఏం కోరుకుంటున్నారో.. ఏం మిస్ అవుతున్నారో అనే విషయాలన్నింటిని నేను గమనిస్తున్నా. 'ఫలక్‌నుమా దాస్' తీయకముందు నాలో ఓ కసి ఉండేది. ఈ సినిమాకు ముందు అది పదింతలు పెరిగింది. పిల్లలు, సున్నిత మనస్కులు ఈ సినిమాకు దూరంగా ఉండండి' అన్నారు విశ్వక్‌సేన్. ఆయన కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన మూవీ 'కల్ట్'. తారక్ సినిమాస్ పతాకంపై సందీప్ కాకరాల నిర్మిస్తున్నారు. ఇండియన్ తొలి స్లాషర్ జానర్ (హింస, రక్తపాతంతో కూడిన) మూవీగా వాస్తవ సంఘటనల ప్రేరణతో ఈ చిత్రాన్ని రూపొందించారు. శనివారం టీజర్‌ను లాంచ్ చేశారు. గోవా పబ్‌లో పార్టీ హోస్ట్ మొదలుపెట్టే ఓ ప్రాణాంతకమైన ఆటలో ఓ మిత్రబృందం ఎలా చిక్కుకుంది? ఒక్కొక్కరిని హతమారుస్తూ ముందుకుసాగే ఈ కథలో అసలు గేమ్ మాస్టర్ ఎవరు? అతను రక్షకుడా? ప్రమాదకారుడా? అనే ప్రశ్నలతో టీజర్ ఆసాంతం ఉత్కంఠను పంచింది. ఈ సినిమాలో వందమంది కొత్త నటీనటులున్నారని విశ్వక్‌సేన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర మాటల రచయిత తరుణ్‌భాస్కర్, సంగీత దర్శకుడు రవిబస్రూర్‌తో పాటు చిత్ర ప్రధాన తారాగణమంతా పాల్గొన్నారు. గాయత్రీ భరద్వాజ్, తారక్ పొన్నప, మురళీశర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, నిర్మాత, దర్శకత్వం: విశ్వక్‌సేన్.

## గర్భవతిగానే సినిమా చేశా: లావణ్య త్రిపాఠి

### సినిమా మొదలైన తర్వాత తనకు ప్రెగ్నెన్సీ అని తెలిసిందని వెల్లడి

మెగా కోడలు లావణ్య త్రిపాఠి పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో యాక్టివ్‌గా కొనసాగుతోంది. ఇటీవలే ఆమె పండంటి బాబుకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు, ఆమె ప్రధాన పాత్ర పోషించిన 'సతీ లీలావతి' మార్చి 6న విడుదలకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమోషన్స్‌లో భాగంగా యాంకర్ సుమ కనకాలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో లావణ్య తన ప్రెగ్నెన్సీ సమయంలో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకుంది. "ఈ సినిమా పనులు మొదలైన తర్వాత నాకు ప్రెగ్నెన్సీ అని తెలిసింది. సినిమాకు 'నో' చెబితే నిర్మాతలకు నష్టం అవుతుందని భావించాను. అందుకే గర్భవతిగానే షూటింగ్ చేశాను. వాంతులు అయ్యాక కూడా సెట్‌కి వెళ్లేదాన్ని. మైగ్రేన్ వచ్చినప్పుడు టాబ్లెట్స్ వేసుకుని షూట్ చేసేదాన్ని" అని లావణ్య వెల్లడించింది. యాక్షన్ సన్నివేశాలు చేయాల్సి వచ్చినప్పుడు ఎంతో భయం వేసేదని, ప్రతి షెడ్యూల్ ముగిసిన తర్వాత ఆసుపత్రికి వెళ్లి చెకప్ చేయించుకునేదాన్నని చెప్పింది. మూడు నెలల్లోపే షూటింగ్ పూర్తి చేసేలా ప్లాన్ చేశారని తెలిపింది. డ్యాన్స్ సీక్వెన్స్ సమయంలో కూడా భయం వేసిందని, కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ తన పరిస్థితిని అర్థం చేసుకుని స్టెప్స్ సర్దుబాటు చేశారని చెప్పింది. బేబీ బంప్ కనిపించకుండా కాస్ట్యూమ్స్ లూజ్‌గా డిజైన్ చేయించారని వెల్లడించింది. నాలుగో నెలలో కొన్ని సన్నివేశాలు ప్యాచ్‌వర్క్ చేయాల్సి వచ్చిందని తెలిపింది. ఇంట్లోవాళ్లు మొదట భయపడినా, చివరికి పూర్తి సపోర్ట్ ఇచ్చారని, ముఖ్యంగా భర్త వరుణ్ చాలా అండగా నిలిచారని లావణ్య చెప్పింది. డాక్టర్లు ఎక్కువ ప్రయాణాలు చేయొద్దని చెప్పారని... అయితే, షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగేది కాబట్టి పొద్దున్నే లేచి వెళ్లడం కష్టంగా అనిపించేదని తెలిపారు. "ప్రెగ్నెన్సీ విషయం షూటింగ్ టీమ్‌కు మొదట్లో తెలియదు. తెలిస్తే ప్రత్యేకంగా చూస్తారేమోనని భయంతో చెప్పలేదు" అని ఆమె వెల్లడించింది.





## గాడ్స్ అండ్ సోల్జర్స్

రఫ్ నోట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ద్విభాషా చిత్రం 'గాడ్స్ అండ్ సోల్జర్స్'. ఆరి అరుజునన్, రాజ్‌తరుణ్, భరత్, అమూ అభిరామి, కిశోర్ ఇందులో ప్రధాన పాత్రధారులు. సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం చిత్రీకరణ పూర్తి చేసుకున్నది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో నిమగ్నమైంది. వాస్తవిక సంఘటనలతో వాణిజ్య అంశాల మేళవింపుగా ఈ సినిమా రూపొందుతున్నదని, ఈ సినిమాకోసం అందరూ ప్రాణం పెట్టి పనిచేశారని, కథాపరంగా, సాంకేతికంగా ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని పంచే సినిమా ఇదని, త్వరలోనే టీజర్‌ని విడుదల చేయనున్నామని, సినిమా విడుదల తేదీని త్వరలో తెలియజేస్తామని మేకర్స్ చెప్పారు.



## గ్లోబల్ స్టార్ కాబోతున్న ప్రియమణి!

### ఇండో-అమెరికన్ మూవీలో నటించబోతున్న ప్రియమణి

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ కు వెళ్లిన ప్రియమణి... పలు వెబ్ సిరీస్ లలో కూడా నటిస్తూ బిజీగా ఉంటోంది. ఇప్పుడు హాలీవుడ్ మూవీలో నటించేందుకు సిద్ధమవుతోంది. ఇండో-అమెరికన్ చిత్రంలో ప్రియమణి ప్రధాన పాత్రకు ఎంపికయింది. బాలీవుడ్ నటుడు మోహిత్ రైనాతో కలిసి ఆమె ఈ అంతర్జాతీయ చిత్రంలో నటించబోతోంది.హర్ష్ మహదేశ్వర్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను అమెరికాకు చెందిన రెడ్ బైసన్ ప్రొడక్షన్స్, ముంబైలోని అజూర్ ఎంటర్టైన్మెంట్ సంయుక్తంగా నిర్మించనున్నాయి. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా నిర్మాణ సంస్థలు అధికారికంగా ప్రకటించాయి.భారతీయ, అమెరికా సంస్కృతుల కలయికతో, ఒక వలస కుటుంబం ఎదుర్కొనే భావోద్వేగపూరిత ప్రయాణమే ఈ సినిమా కథాంశం. హాలీవుడ్ సూపర్ హిట్ సినిమాలకు పనిచేసిన అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు ఈ ప్రాజెక్ట్ కోసం పనిచేస్తుండటం గమనార్హం. ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ లో ప్రారంభం కానుంది.